

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి, డిఎఫ్‌ఒ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వీరు కలిసి జిల్లాలోని పరిస్థితులను ఆయనకు వివరించారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎస్‌పి, డిఎఫ్‌ఒ

కౌలు రైతులకు కష్టాలు తప్పవా?

కౌలు రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేలా కనిపించట్లేదు. నేటికీ సగం మందికి కూడా కౌలుదారు కార్డులు అందలేదు. ఫలితంగా వారు ప్రభుత్వం అందించే ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఈ ఖరీఫ్‌కూ పెట్టుబడికి డబ్బులు లేక బ్యాంకుల నుంచి రుణాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. చేసేది లేక ప్రయివేటు వ్యాపారుల వద్దకు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


- సిసిఆర్ కార్డుల జారీలో తప్పని జాప్యం
- ఉమ్మడి జిల్లాలో సకాలంలో గుర్తింపు దక్కేనా.!
- ప్రయోజనాలను కోల్పోతామంటున్న కౌలుదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదున్నర లక్షల మందికి పైగా వరి రైతులుండగా వీరిలో మూడున్నర లక్షల మందికి పైనే కౌలు రైతులున్నారు. సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అందడం లేదు. ప్రతి ఏటా అప్పులు చేసి సాగు చేస్తున్న పెట్టుబడి సొమ్ములు కూడా రాని పరిస్థితులు నెలకున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు వచ్చి పంటలకు నష్టం జరిగితే అనేకమంది అప్పుల ఊబిలోకి కూరుకు పోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఇలా కౌలు రైతులు కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిసిఆర్ కార్డుల జారీలో జాప్యం చోటు చేసుకుంటుంది. అంతే కాకుండా పూర్తిస్థాయిలో రైతులందరికీ కార్డులు అందడం లేదు.

జాప్యంతో ఇబ్బందులు

జిల్లాలో 70 శాతం పంటలను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సొంతభూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలకు తోడు ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా సొమ్ముతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ జిల్లాలో ఉన్న కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. వారిని గుర్తించడంలో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటుంది. ప్రభుత్వం ఏటా వారికి అందించే సిసిఆర్‌సి(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు)పత్రాలు ఇప్పటికే వారికి అందలేదు. యంత్రాంగం వాటి జారీ పనిలో ఉంది. గతంలో ఈ కౌలు పత్రాలు కలిగి ఉన్న రైతులు కూడా మళ్లీ రెన్యువల్ చేయించుకుంటేనే కార్డు మనుగడలోకి వస్తుంది. సిసిఆర్‌సి కార్డు గడువు 11 నెలల్లో ముగుస్తుంది. మళ్లీ భూ యజమాని అనుమతితో కార్డును రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని మే నెలాఖరుకు ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ మొదటి వారంలోపే కార్డులను రైతులకు అందించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నత్తనడకన నడుస్తుంది. ఆగస్టు, సెప్టెంబర్ వరకూ కార్డులు అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయశాఖ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత పత్రాలన్నీ రైతులు సమర్పిస్తే విఆర్‌ఒల ఆమోదంతో ఈ కార్డులను కౌలు రైతులకు అందజేస్తారు. ఈ ప్రక్రియ అంతా జరిగి రైతులకు కార్డులు అందేసరికి ఆగస్టు [illegible] అవకాశం ఉందని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగుకు అవసరమైన [illegible] విత్తనాలతో పాటు అర్హత కలిగిన వారి రైతుభరోసా సాయానికి కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. సిసిఆర్‌సి కార్డులు సకాలంలో అందక కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు.



నత్తనడకన జారీ ప్రక్రియ

మూడు జిల్లాల్లో మూడున్నర లక్షల మంది కౌలు రైతులు ఉంటారని అంచనా. అయితే ప్రభుత్వం అతి తక్కువగానే లక్ష్యాన్ని నిర్దేశించి అందజేస్తుంది. కాకినాడ జిల్లాలో 57 వేల కార్డులను అందించాలని లక్ష్యంగా తీసుకున్నారు. వీరిలో సుమారు 46 వేల మందికి రూ.190 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం 450 మందికి మాత్రమే కార్డులు అందజేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 77 వేల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క కార్డు కూడా జారీ చేయలేదు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో 1.09 లక్షల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకుని ఇప్పటి వరకు కేవలం 1300 మాత్రమే కార్డులు ఇచ్చారు. దీనిపై రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో భూ యజమానులకు సిసిఆర్ కార్డులపై అవగాహన కల్పించాలి. కార్డుని కౌలుదారికి ఇచ్చినంత మాత్రాన భూమిపై హక్కులకు వచ్చిన ముప్పేమి లేదని వివరించాలి. అదేవిధంగా కౌలు రైతులకు సైతం కార్డు వల్ల ఉపయోగాలను చెప్పి చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. కానీ ఇవేమీ అమలు జరగడం లేదు.

ప్రయోజనాలు కోల్పోతున్న కౌలు రైతులు

క్షేత్రస్థాయిలో భూ యజమాని ఒప్పంద పత్రం తప్పనిసరి అంటున్న కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వం కౌలు రైతులకు కచ్చితంగా న్యాయం చెయ్యాలనుకుంటే భూ యజమాని ఒప్పంద పత్రం తీసుకునే బాధ్యతను రాష్ట్రప్రభుత్వమే తీసుకోవాలి. ఈ విధంగా కార్డులు ఇవ్వడం వలన పంట మీద వచ్చే రాయితీలను కౌలు రైతులకు చేరేలాగ. కానీ అన్ని రాయితీలనూ కేవలం 10 శాతం కూడా కౌలు రైతులకు దక్కడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శాస్త్రీయమైన ఆధారాలతో వాస్తవ సాగు దారులకు కేటాయించిన రాయితీలు పూర్తిగా చేరితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.



పుస్తక విక్రయం కేంద్రం వద్ద బైటాయించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కెకెఆర్ గౌతమి పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పుస్తక విక్రయాలను అడ్డుకున్న ఎస్‌ఎఫ్‌ఐ బృందం
సంబంధిత కేంద్రాన్ని సీజ్ చేసిన డివైఇఒ

ప్రజాశక్తి - కాకినాడ

నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహ రిస్తున్న డాక్టర్ కెకెఆర్ గౌతమి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మంగళవారం ఎస్ఎఫ్ఐ బృందం కెకెఆర్ గౌతమి పాఠశాలను సందర్శిం చింది. ఈ సందర్భంగా సంబంధిత పాఠశాల యాజమాన్యం సిబ్బంది నిబంధ నలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, తదితర స్టేష నరీని విక్రయించడాన్ని ఎస్ఎఫ్ఐ బృందం గమనించింది. దీంతో వెంటనే విక్రయాలు చేస్తున్న రూమ్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు బైటాయిం చారు. సుమారు నాలుగు గంటలపాటు ధర్నాను కొనసాగించారు. దీంతో డివైఇఒ వెంకటేశ్వర్లు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఇతర స్టేషనరీ విక్రయా లను ఆయన పరిశీలించి, సంబంధిత గదిని సీజ్ చేశారు. ఇదే అంశాన్ని కలెక్టర్, డిఇఒ దృష్టికి తీసు కెళ్లి సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకుం టామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కెకెఆర్ గౌతమి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర స్టేషనరీని అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. జిల్లాలో అధికారుల నిర్లక్ష్యంతో అన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విక్రయాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల తల్లీదండ్రుల నుంచి పుస్తకాలు, యూనిఫాం పేరుతో కోట్లాది రూపాయలు గుంజుతున్నారని విమర్శంచారు. ఈ విద్యా సంవత్సరంలో ఒక్క పాఠశాలను కూడా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయలేదని అన్నారు. కలెక్టర్, డిఇఒలకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. జిల్లాలో నూటికి 90 శాతానికి పైగా పాఠశాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వారి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహయ కార్యదర్శి కె.మణికంఠ, నగర కార్యదర్శి వాసుదేవ్, కాకినాడ రూరల్ అధ్యక్షులు రాజేష్, నగర నాయకులు జైరాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక విక్రయకేంద్రాన్ని సీజ్ చేస్తున్న డివైఇఒ వెంకటేశ్వర్లు



సిఐటియు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

25వ రోజుకు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని చిన్నింపేట జీడి పిక్కల పరిశ్రమలో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన ఆందోళన మంగళవారానికి 25వ రోజుకు చేరుతుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లడుతూ యాజమాన్యం కనీసం కార్మికులతో మాట్లాడడానికి సిద్ధపడకపోవడం అన్యాయమని అన్నారు. గత కొన్నిఏళ్లుగా పరిశ్రమ కోసం తమ శ్రమశక్తిని అందించిన కార్మికులు తమకు తెలియదన్నట్లుగా యాజమాన్యం వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే తొలగించిన కార్మికులను పరిశ్రమలోకి తీసుకుని ఉత్పత్తిని పెంచి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాడ్ చ ఏశారు. తక్షణమే ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం సంపదించి కార్మికులకు జీవనోపాధి కల్పించేలా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.సాల్మన్‌రాజు, బి. నాని, ఎన్.సుబ్బారావు, బి.అప్పారావు, వై.చిన్ని, వి.సతీష్, ఎ.కుమారి, ఎ.రత్నం, ఎం.ప్రియాంక, సూర్యావతి, గౌరీ, దుర్గ్గా పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ దృష్టికి కౌలు రైతుల సమస్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు కోరారు. మంగళవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వళ్ల రాజబాబు ఆధ్వర్యంలో పలువురు కౌలు రైతులు ఎంఎల్ఎను కలిసి స్థానిక మండల సమస్యలతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రాల రూపంలో అందించారు. ఈ సందర్భంగా రాజ బాబు మాట్లాడుతూ భూ యజమానితో సంబం ధం లేకుండా కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని, 2011 భూ అదీకృత చట్టాన్ని అమలు చేయాలని, రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ క్రాప్‌లో ప్రతి కౌలు రైతును చేర్చి పంట రుణం, పంట నష్టం పంటల బీమా, రైతు భరోసా వంటి రాయితీలు కౌలు రైతులకు ఇవ్వాలని, కులంతో సంబంధం లేకుండా భూమి విస్తీర్ణం ఎంత చేస్తున్నప్పటికీ అన్ని కులాల కౌలు రైతులకు రైతు భరోసా వర్తింప చేయాలని కోరారు. మండలంలో సైఫాన్ కింద ఉన్న 6 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలని, పంట కాలవలు మురుగు కాలవలు బాగు చేయా లని, ఇంజరం వంతెన వెంటనే నిర్మించి ప్రత్యా మ్నాయ కరకట్ట తొలగించాలని, సైపాన్ కాలవపై పంట నీరు రావడానికి సిమెంటు తొట్టి నిర్మించా లనీ కోరారు. దాళ్వాలో అమ్మిన ధాన్యానికి బకాయి లను చెల్లించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు స్పం దిస్తూ కౌలు రైతులకు న్యాయం జరిగేలా ప్రభు త్వాన్ని ఒప్పిస్తామని, స్థానిక సమస్యలపై అధికా రులతో, ప్రభుత్వంతో మాట్లాడి పంట పొలాలు పూర్తిగా సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో సంఘీయులు భజన సత్తిబాబు, పి.మల్లవరం, జార్జిపేట రైతులు పిల్లి సత్యనారాయణ, దడాల వెంకటేశ్వరరావు, సూరంపూడి సూరిబాబు, పేరాబత్తుల సాయినరేంద్ర, కాదా రామకృష్ణ, అనుసూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంఎల్ఎ దాట్లకు వినతిపత్రం ఇస్తున్న వళ్లు రాజబాబు

జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధా న్యత ఇస్తూ జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.షాన్ మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఆర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు వంటి అంశాలపై ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ డిఆర్‌డిఎ, సిపిఒ, మెప్మా, డిపిఎం డిజాస్టర్ మేనేజ్‌మెంట్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ, పెద్దాపురం డిఎల్‌డిఒలు, ఉపాధి శిక్షణ తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయిలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఒ పి.త్రినాథ్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు, డిపిఎం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎం.లావణ్య, కాకినాడ డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

'జొన్నలదొడ్డిపై ప్రత్యేక దృష్టి సారించాలి'

ప్రజాశక్తి - సామర్లకోట

అతిసార వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేలా జొన్నలదొడ్డి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదే శించారు. మంగళవారం జొన్న లదొడ్డి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భ:గా సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రామాన్ని ఆను కుని ఉన్న చెరువులో నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించాలని, మురికి నీరు చెరువులోకి చేరకుండా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో అతిసార కేసులకు సంబంధించిన వివరాలను వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వై.హిమావతి ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, టిడిపి నాయకుడు గుమ్మల్ల రామకృష్ణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జొన్నలదొడ్డిలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ

డిఎం అండ్ హెచ్‌ఒ క్షేత్ర స్థాయి పరిశీలన

జొన్నలదొడ్డి ప్రాంతంలో నమోదవుతున్న అతిసార కేసుల పరిస్థితులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహనాయక్ క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అతిసారవ్యాధితో బాధపడుతున్న ముగ్గురుని కలసి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వై.హిమావతికి సూచనలు చేశారు.

ఆర్‌బి పట్నంలో నేను బడికి పోతా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం


మండలంలోని రాయ భూపాలపట్నంలో మంగళవారం నేను బడికి పోతా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరాలనే లక్ష్యంతో ఈ ర్యాలీ చేపట్టామన్నారు. నూరు శాతం బాలలను బడిలో చేర్పించాలనే ధ్యేయంతో ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ గ్రామంలోని అన్ని వీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.మల్లేశ్వరరావు, ఎండిఎం షరీఫ్, జి.సాయిబాబా, కె.సూరిబాబు, వై.శ్రీనివాసరావు, టిఎస్ఎన్. మూర్తి, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎన్. శ్రీనివాస్, తరుణ్, పట్టాభి, జాన్, ఎం.వరలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా తాళ్లూరు లిఫ్ట్ పూర్తి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలానికి చెందిన తాళ్లూరులోని పుష్కర కాల్వకు అనుసంధానంగా ఉన్న తాళ్లూరు లిఫ్ట్‌ను ఏడాదిలోగా పూర్తి చేస్తానని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం ఆయన ఇరిగేషన్ అధికారులు వై.జగదీష్, సిహెచ్.రామలక్ష్మి, మెగా కంపెనీ పిఎం.మురళి, రైతులతో కలిసి తాళ్లూరు లిఫ్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్ అధ్వానంగా తయారవ్వడానికి కారణం గత వైసిపి ప్రభుత్వమే అని అన్నారు. ప్రస్తుతం ఉన్న సిఎస్ పైపుల స్థానంలో ఎంఎస్ పైపులతో పూర్తి చేసేందుకు రూ.49 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కొంత సమయం తీసుకుని సిఎం చంద్రబాబుతో మాట్లాడి నిధులు రాబట్టి ఏడాదిలోగా పూర్తి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అప్పటివరకు రైతులు తమ బోర్లు, చెరువులు వర్షాధారం మీద పండించుకునే రైతులు తప్ప పుష్కర లిఫ్ట్‌పై ఆధారపడి పంటలు వేసుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో ఎస్‌విఎస్. అప్పల రాజు, పి.మోహనరావు, ఎం.భద్రం, కె.చిట్టిబాబు, ఎస్.రాజు, వై.కాశి, సర్పంచి ఎస్.వీరబాబు, ఇపర్ల బాబి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'




సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెవి.నరేష్ తెలిపారు. మంగళవారం ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గృహ పరిసరాల్లో శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని లేదా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. నిల్వ చేసిన మాంసం, చేపలు ఇతర ఆహార పదార్థాలను .తినరాదని అన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలని, ఆహారంపై ఎల్లప్పుడూ మూతలు పెట్టి ఉంచాలన్నారు. దోమకాటు నుంచి రక్షణ కొరకు దోమతెరలు వాడాలని, లెట్రిన్ గొట్టాలకు నెట్ విధిగా కట్టాలని అన్నారు బహిరంగ మలవిసర్జన చేయరాదని, మల, మూత్ర విసర్జన చేసిన తర్వాత భోజనానికి ముందు విధిగా చేతులను శుభ్రపరచుకోవాలని, వాంతులు, విరోచనాలు అయితే వెంటనే ఆరోగ్య కార్యకర్త లేదా ఆశా కార్యకర్తకు తెలియపరచాలని అన్నారు. విరోచనాల సమయంలో తప్పనిసరిగా ఒఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, అలాగే కొబ్బరి నీరు, గంజి లేదా పంచదార ఉప్పు కలిపిన నీరు తప్పనిసరిగా తాగాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన జింక్ మాత్రలు విధిగా వేసుకోవాలి తద్వారా ఇమ్యూనిటీ పెరుగుట శ్వాసకోశవ్యాధులు రాకుండా అరికట్టవచ్చునని అన్నారు.



డాక్టర్ కెవి.నరేష్



ఇండస్ట్రీయల్ రోడ్డు మార్గంలో గుట్టగా పేరుకుపోయిన చెత్త

గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా మారిపోతుంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతుంది. కళ్లెదుటే కన్పిస్తున్నా సంబంధిత విభాగం అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వీరయ్యమ్మ పేట నుంచి తలుపులమ్మ వీవర్స్ కాలనీ మీదుగా ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే రహదారిలో ఉన్న చెత్తపై ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఆ చెత్తను ఒకచోటకు గుట్టగా చేశారు. ఈ తతంగం జరిగి 15 రోజులు కావస్తున్నా నేటికీ గుట్టలుగా చేర్చిన చెత్తను ఆ ప్రాంతం నుంచి తరలించిన పరిస్థితి లేదు. దీంతో గుట్టలుగా ఉన్న చెత్తను పందులు, ఇతర పశువులు చేరి తిరిగి చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో దోమల, ఈగలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే అతిచార వ్యాధి గ్రామీణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న తరుణంలో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి గుట్టలుగా ఉన్న చెత్తను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

29న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 23 అంశాలున్న ఎజెండాపై చర్చ జరుగుతుందన్నారు. అనంతరం కాంట్రాక్టు కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

పాఠశాలల్లో చేర్చేలా చొరవ చూపాలి

ప్రజాశక్తి - కరప

ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్చేందుకు వారి వారి తల్లీదండ్రులు చొరవ చూపాలని ఎంఇఒలు కెవి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలానికి చెందిన నడకుదురు గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మెండు గోవిందు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్స్‌పై ఎంఎస్‌ఒ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పలు హోటల్స్‌ను సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎంఎస్‌ఒ కీర్తి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టగా నిబంధనలకు విరుద్ధంగా వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే గ్యాస్ రీఫిల్లింగ్ చేసే షాప్‌లలో తనిఖీలు నిర్వహించి 5 డోమెస్టిక్ సిలిండర్‌లను సీజ్ చేసి సదరు నిర్వాహకులపై కేసులను నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్‌లను పవన్‌కుమార్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు ఎంఎస్‌ఒ తెలిపారు. ఈ తనిఖీలలో పెద్దాపురం ఎంఎస్‌ఒ విజయకుమారి, విఆర్‌ఒ తులసిరాంజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కామరాజుపేటలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని కామరాజుపేట గ్రామానికి చెందిన చంద్రు రమణ (29) వ్యక్తిగత పనులపై గోకవరం వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళుతుండగా గోకవరం శివారులో తన బైకు అదుపు తప్పి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయలపాలయ్యాడు. తీవ్రరక్తస్రావం కావడంతో మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వరుస దొంగతనాలతో ప్రజల ఆందోళన

ప్రజాశక్తి- రాజానగరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతానాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నెల 18న రాత్రి రాజానగరం కొత్త కాలనీలో మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరాలకు పాల్పడ్డారు. బంగారం, నగదు భారీగా అపహరించారు. పాతవెలుగుబొంద జగన్న కాలనీలో సోమవారం రాత్రి మరో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న బర్ల భవానీ ఇంటికి తాళం వేసి ఊరికి వెల్లింది. తిరిగి వచ్చే సరికి ఇంటిలో సుమారు నాలుగు కాసుల బంగారం, ఒక కేజీ వెండి, రూ.25 వేల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌తో పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - పెదపూడి

మండలానికి చెందిన గొల్లల మామిడాడ గ్రామంలోని గమ్యం జూనియర్ కాలేజీలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ ఆర్‌జె. సతీష్‌బాబు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్ధాలు గురించి, మాదకద్రవ్యాలతో పట్టుబడితే చట్టరీత్యా తీసుకొనే కఠిన చర్యలు, తదితర అంశాలపై వివరించారు. మాదకద్రవ్యాల గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గమ్యం జూనియర్ కాలేజీ ఛైర్మన్ కర్రి శివారెడ్డి, ఎన్.దొరబాబు, పి.సత్యనారాయణ, సెబ్ ఎస్ఐ ఐఎన్‌ఎస్.బాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని విట్ కర్ గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎయిడెడ్ పాఠశాలల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై చినరాజప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, హైస్కూల్ కరస్పాండెంట్ మైలాబత్తుల జానీమోజెస్, హెచ్ఎం రత్నకుమారి పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను వారసులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 256/1, 276/30 వరకూ గల 96 ఎకరాల అసైన్డ్ భూములను లబ్ధిదారుల వారసులకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, కె.సింహాచలం, డి.అదృష్టదీపుడు ఒక ప్రకటనలో కోరారు. 1970లో కోరంగి గ్రామంలో ప్రభుత్వం ఒక్కొక్కరికి 2.40 ఎకరాలు చొప్పున 40 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూమి ఇచ్చిందన్నారు. ఆ భూమిని సెల్వరాజ్ అనే వ్యక్తి అన్యాక్రాంతం చేసి రొయ్యల చెరువులుగా మార్చి అనుభవించగా వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో 2007లో లబ్ధిదారులతో కలిసి భూముల్లో జెండాలు పాతి పలుమార్లు ప్రభుత్వ అధికారులకు, తాజా, మాజీ శాసనసభ్యులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టులో పెండింగ్ లో ఉన్నదని అది తేలిన వెంటనే భూములు అప్పగిస్తామని చెప్పి ఏళ్లు గడిచిన ఇప్పటివరకు లబ్ధిదారులకు భూములు అప్పగించ లేదంటే ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పేదల పట్ల, చట్టాల అమలుపట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు లబ్ధిదారుల వారసులకు ఆ భూమిని వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం



సదస్సులో మాట్లాడుతున్న సిఐ సుబ్రహ్మణ్యం

మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మండలానికి చెందిన చంద్రమాంపల్లి గ్రామంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జరిగిన ర్యాలీ అనంతరం జడ్‌పి హైస్కూల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎయుబి సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఎవివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులైతే వారి భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కాకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల వల్ల అనర్ధాలు, అనారోగ్య సమస్యలపై వివరించారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా స్పష్టమైన అభిప్రాయంతో ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి పనులను పరిశీలించిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం



నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆయా శాఖల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్థానిక గోపాల్ నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు వ్యవసాయ శాఖ నుంచి భూములు బదలాయింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం వద్ద భూములను ప్రజాపనులశాఖ రెవెన్యూ సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ప్రజా పనుల శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీ విద్యాలయ పాఠశాలకు నోటీసులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలానికి చెందిన సుంకరపాలెంలో ఉన్న శ్రీ విద్యాలయా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ ఎ.మంగాయమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కాకినాడ డివైఇఒ కె.వెంకటేశ్వరరావు పాఠశాలను తనిఖీలు చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పాఠశాల యాజమని చోడిశెట్టి శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ మంగాయమ్మ తెలిపారు.

పిల్లారాయ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పిల్లారాయ స్వామికి ఆలయ అర్చకులు మానేపల్లి వీరభద్ర శర్మ పర్యవేక్షణలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాంగారక చతుర్థి, సంకష్టచతుర్థిని పురస్కరించుకుని ఆలయంలో భక్తులచే లక్షగరికపూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 108 లీటర్ల ఆవుపాలు, విశేష ద్రవ్యములచే ప్రత్యేక పూజలు చేశారు.

గ్రంథాలయానికి ఫ్యానుల బహుకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి మంగళవారం టిడిపి పట్టణ కార్యదర్శి, మహారాణి సత్రం మాజీ ఛైర్మన్ తూతిక రాజు, నాగు సోదరులు ఫ్యానులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లయ్య, కొమ్మన అప్పారావు, నాని, బి అరవింద్, రామారావు, నరేంద్ర కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రూ. 23 కోట్ల మంజూరు


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చిన్నరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాను మెరుగు పరచేందుకు రూ.23 కోట్లు నిధులు మంజూరైనట్టు నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డు వేలంపేటలో ఎంఎల్‌ఎగా హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా వార్డు ప్రజలు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించే విషయంలో ఇబ్బందులు ఉన్నందున వాటిని పరిష్కరించేందుకు రూ.23 కోట్లతో పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ లోతట్టు ప్రాంతంగా ఉన్నందున దానిని ఎత్తుచేసి వర్షపు జలాలు నిలువకుండా పనులు చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. అలాగే ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టడం తోపాటు మధ్యలో నిలిచి పోయిన వెలమ కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చెయ్యనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమార స్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, నాయకులు యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, తెదితరులు పాల్గొన్నారు.


డిజిపితో ఎంఎల్‌ఎ పంతం నానాజీ

డిజిపిని కలిసిన ఎంఎల్‌ఎ పంతం

ప్రజాశక్తి - కరప

రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావును కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలివారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఆయనను కలిసి నానాజీ శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యానికి చర్యలు

రాజమహేంద్రవరం : రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని, దాతల సహకారంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పిస్తామని ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. వివిధ విభాగాలను తనిఖీ చేసి లోటుపాట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపడతామన్నారు. ఒపి వద్ద సర్వర్ లోపం కారణంగా కొద్దిగా జాప్యం జరుగుతోందన్నారు. దానిని సరి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సర్వర్ పని చేయని పక్షంలో మాన్యువల్‌గా ఓపీ ఇస్తున్నారన్నారు. ఎపి పేపరు మిల్లు సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా టెస్టింగ్ ఎక్వీప్‌మెంట్‌ను సమకూరుస్తామన్నారు.